# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

VC NEWS

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ గురువారం 06 జూన్ 2024

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:01 సంచిక: 330

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


ఓడిన స్థానాల్లో గెలిచి.. గెలిచిన చోట వెనకబడి..



## భారాస ఎమ్మెల్యేలు ఆత్మప్రబోధానుసారం

# వ్యవహరించాలి

"అసెంబ్లీ ఎన్నికల్లో 39 సీట్లు గెలుచుకున్న భారాస.. లోక్‌సభ ఎన్నికల్లో మూడు శాసనసభ సెగ్మెంట్లలోనే ఆధిక్యం కనబరిచింది. భారాసను అంతర్ధానం చేసి.. భాజపాను గెలిపించేందుకు కేసీఆర్ తమ పార్టీ ఓట్లు బదలాయించారు.

- వారి ఆత్మగౌరవాన్ని భాజపాకు తాకట్టు పెట్టిన కేసీఆర్ కుటుంబం
- 'గులాబీ' ఓట్లను కమలదళానికి బదలాయించారు
- మోదీ గ్యారంటీని ప్రజలు తిరస్కరించారు
- రాష్ట్రంలో పార్టీ జయాపజయాలకు నాదే బాధ్యత
- డిసెంబరు 9న తెలంగాణ తల్లి ఉత్సవాలు
- సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడి

2లో



## రూ.700 కోట్లలో ఎవరి వాటా ఎంత?

**గొర్రెల సరఫరా పథకం కుంభకోణం విలువను రూ.700 కోట్లుగా గుర్తించిన అవినీతి నిరోధకశాఖ.. దర్యాప్తును ముమ్మరం చేసింది. ఒక ప్రభుత్వ పథకంలో ఇంత భారీ మొత్తం కొల్లగొట్టడం వెనక 'పెద్దల' పాత్ర తప్పనిసరిగా ఉండి ఉంటుందని అనుమానిస్తోంది.**

హైదరాబాద్: గొర్రెల సరఫరా పథకం కుంభకోణం విలువను రూ.700 కోట్లుగా గుర్తించిన అవినీతి నిరోధకశాఖ.. దర్యాప్తును ముమ్మరం చేసింది. ఒక ప్రభుత్వ పథకంలో ఇంత భారీ మొత్తం కొల్లగొట్టడం వెనక 'పెద్దల' పాత్ర తప్పనిసరిగా ఉండి ఉంటుందని అనుమానిస్తోంది. ఈ నేపథ్యంలో అనిశా తదుపరి దర్యాప్తునకు ప్రాధాన్యం ఏర్పడింది. ఈ పథకానికి అనధికారిక కాంట్రాక్టర్‌గా వ్యవహరించిన లొలొన కంపెనీ నిర్వాహకుడు మొహిదుద్దీన్.. కేసు నమోదైన వెంటనే దుబాయ్‌కు పారిపోయిన విషయం తెలిసిందే. అతడిని తిరిగి రప్పించేందుకు అనిశా లుక్‌అవుట్ నోటీస్ జారీ చేయించింది. అతడిని విచారిస్తే పెద్దల పాత్రపై కీలక విషయాలు వెలుగులోకి వస్తాయని భావిస్తోంది. కొట్టేసిన సొమ్మును ఎవరెవరు పంచుకున్నారో తేల్చేందుకు.. అరెస్టయిన నిందితుల, మొహిదుద్దీన్ బ్యాంకు లావాదేవీలపై అనిశా దృష్టిసారించింది. అనుకూలమైన అధికారులను నియమించుకుని..

ఈ కేసులో కామారెడ్డి ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకుడు డా.రవి, మేడ్చల్ జిల్లా పశువైద్యశాఖ సహాయ సంచాలకుడు డా.ఎం.ఆదిత్య కేశవసాయి, రంగారెడ్డి జిల్లా భూగర్భ జలశాఖ అధికారి పసుల రఘుపతిరెడ్డి, వయోజన విద్యాశాఖ ఉపసంచాలకుడు సంగు గణేశ్, పశుసంవర్ధకశాఖ సంయుక్త సంచాలకుడు అంజిలప్ప, సహాయ సంచాలకుడు కృష్ణయ్యను గతంలోనే అరెస్ట్ చేశారు. రాష్ట్ర గొర్రెలు, మేకల అభివృద్ధి సమాఖ్యకు ఎండీగా పనిచేసిన రాంచందర్‌నాయక్‌తోపాటు మాజీ మంత్రి

తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు ఓఎస్డీగా పనిచేసిన కల్యాణ్‌ను ఇటీవలే అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. అప్పటి ప్రభుత్వంలో పశుసంవర్ధక శాఖను పర్యవేక్షించిన పెద్దల ఆశీస్సులతో ఉన్నతాధికారులను మొహిదుద్దీన్ గుప్పిట పెట్టుకున్నట్లు అనిశా ప్రాథమిక దర్యాప్తులో తేలింది.

# తెలంగాణ రాష్ట్రమంతా నైరుతి



- హైదరాబాద్‌లో కురిసిన వర్షానికి జలమయమైన రోడ్డు
- వారంలో విస్తరించనున్న రుతుపవనాలు
- ఇప్పటికే ఉమ్మడి పాలమూరు జిల్లాలో విస్తరణ
- బంగాళాఖాతంలో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం
- హైదరాబాద్ బేగంబజార్‌లో 8.5 సెం.మీ వర్షపాతం

**హైదరాబాద్:** నైరుతి రుతుపవనాలు చురుకుగా కదులుతున్నాయి. ఈనెల 3న రాష్ట్రంలోని ప్రవేశించిన నైరుతి రుతుపవనాలు.. రెండ్రోజుల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కు విస్తరించినట్లు వాతావరణ శాఖ తెలిపింది. ప్రస్తుతం తెలంగాణ లోని నారాయణపేట, ఆంధ్రప్రదేశ్‌లోని నర్సాపూర్ గుండా రుతుపవనాలు కదులుతున్నట్లు చెప్పింది. 3 రోజుల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు రుతుపవనాలు విస్తరిస్తాయని, కదలికలు ఇదే తరహాలో ఉంటే వారం రోజుల్లో రాష్ట్రంలోని దాదాపు అన్ని ప్రాంతాలకు వ్యాపిస్తాయని అంచనా వేస్తోంది. రుతుపవనాల రాకతో రాష్ట్రంలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. పగటి పూట కొంతసేపు గరిష్ట ఉష్ణోగ్రతలు భారీగా నమోదవుతున్నప్ప టికీ.. ఆశాశం మేఘావృతం కావడంతో క్రమంగా ఉష్ణోగ్రతల తీవ్రత తగ్గుతూ వస్తోంది. సాయంత్రానికి పూర్తిగా చల్లని వాతావరణం ఏర్పడుతోంది. రెండు రోజులు రాష్ట్రంలో ఉష్ణో గ్రతలు సాధారణం, అంతకంటే తక్కువగా నమోదు కావొచ్చని ఆ శాఖ అంచనా వేసింది. నిజామాబాద్‌లో గరిష్ట ఉష్ణోగ్రత: దక్షిణ కోస్తా ఆంధ్రప్రదేశ్, ఉత్తర తమిళనాడు తీరం వద్ద పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం బుధవారం నైరుతి బంగాళాఖాతం ప్రాంతాలలో కేంద్రీకృతమై ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. ఇది దక్షిణ ఆంధ్రప్రదేశ్, దాని పరిసర ప్రాంతాలలో సముద్ర మట్టం నుంచి సగటున 3.1 కిలోమీటర్ల నుంచి 4.5 కిలోమీటర్ల ఎత్తులో కేంద్రీకృతమై ఉన్నట్లు వివరించింది.

# లోక్‌సభ ఎన్నికల్లో లెక్కలు తారుమారు

- 2023 అసెంబ్లీ ఫలితాలకు భిన్నంగా లోక్‌సభ ఎన్నికల్లో ప్రజల తీర్పు
- బీఆర్ఎస్ గెలిచిన 39 స్థానాల్లో 36 చోట్ల ఆ పార్టీ ఓట్లను పంచుకున్న బీజేపీ, కాంగ్రెస్
- అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచిన కొన్నిచోట్ల, బీఆర్ఎస్ గెలిచిన చాలా స్థానాల్లో బీజేపీ పైచేయి
- కాంగ్రెస్ గెలిచిన 'లోక్‌సభ' పరిధిలోని అసెంబ్లీ స్థానాల్లో ఆ పార్టీకే ఆధిక్యత
- బీజేపీ గెలిచిన స్థానాల్లో మాత్రం చాలాచోట్ల రెండో స్థానం
- అసెంబ్లీలో గెలిచిన చాలాచోట్ల మూడోస్థానానికి పరిమితమైన బీఆర్ఎస్

2లో

# ఢిల్లీలో మళ్లీ కీలకంగా చంద్రబాబు



- కొత్త ప్రభుత్వ ఏర్పాటులో మళ్లీ ముఖ్య భూమిక
- ఆయన ఏం చెబుతారోనని ఆసక్తి కనబరిచిన జాతీయ మీడియా
- స్పీకర్, మంత్రి పదవులపై పెదవి విప్పని తెదేపా అధినేత
- తెలంగాణ గవర్నర్ రాధాకృష్ణన్‌తో చంద్రబాబు

2లో

తెదేపా అధినేత చంద్రబాబునాయుడు దాదాపు మూడు దశాబ్దాల తరువాత మళ్లీ ఢిల్లీలో కీలకంగా మారారు.

## మా అసోసియేషన్ నుండి నటి హేమ సస్పెండ్

**హైదరాబాద్:** టాలీవుడ్ నటి హేమకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఆమెను ఆమెను సస్పెండ్ చేస్తూ 'మా' అసోసియేషన్ కీలక నిర్ణయం తీసుకుంది. అయితే మా అసోసియేషన్‌లో నటి హేమ సభ్యత్వాన్ని శాశ్వతంగా రద్దు చేసే యోచనలో ఉన్నట్లు సమాచారం. ఈ విషయంపై మా అసోసియేషన్ అధ్యక్షుడు, హీరో మంచు విష్ణు గురువారం నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇప్పటికే మా అసోసియేషన్ గ్రూప్‌లో సందేశం పంపినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా సభ్యత్వం శాశ్వత రద్దుపై అభిప్రాయాలు సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. దీనిపై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.బెంగళూరులో జరిగిన రేవ్ పార్టీలో గత నెల 20న తెలుగు సినీ నటి హేమ దొరికిపోయిన విషయం తెలిసిందే. మొదటగా ఆమె తప్పుడు సమాచారం ఇచ్చేందుకు ప్రయత్నించి అడ్డంగా దొరికిపోయింది. బెంగళూరు రేవ్ పార్టీలో ఉన్న హేమ.. హైదరాబాద్ ఫాంహౌస్‌లో ఎంజాయ్ చేస్తున్నట్లు వీడియో రూపంలో విడుదల చేసి పోలీసులతో పాటు అందరినీ తప్పు దారి పట్టించింది. ఈ విషయం తెలుసుకున్న బెంగళూరు పోలీసులు అమెను అరెస్ట్ చేసింది. తర్వాత సీసీబీ పోలీసులు ఎదుట విచారణ చేశారు. అయితే డ్రగ్స్ కూడా సప్లై చేసిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో హెబ్బగోడి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కావడంతో అనేకల్ నాల్గో అడిషనల్ సివిల్, జేఎంఎఫ్‌సీ కోర్టులో హేమను హాజరుపరిచారు. ఇందులో భాగంగా ఆమెకు జూన్ 14వరకు జ్యుడీషియల్ కస్టడీ విధిస్తూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది.

# లోక్‌సభ ఎన్నికల్లో లెక్కలు తారుమారు




హైదరాబాద్: ఆరు నెలల క్రితం జరిగిన శాసనసభ ఎన్నికల్లో వచ్చిన ఫలితాలకు భిన్నంగా లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు తీర్పు చెప్పారు. 2023 నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచిన కొన్ని స్థానాల్లో, బీఆర్ఎస్ గెలిచిన చాలా నియోజకవర్గాల్లో ఇప్పుడు బీజేపీ పైచేయి సాధించింది. రాష్ట్రంలోని 17 పార్ల మెంటు స్థానాలకు గాను హైదరాబాద్‌లో ఎంఐఎం విజయం సాధించగా, మిగతా 16 సీట్లను బీజేపీ, కాంగ్రెస్ సమానంగా పంచుకున్న విషయం తెలిసిందే.

అయితే కాంగ్రెస్ గెలి చిన 8 పార్లమెంటు స్థానాల్లోని 56 అసెంబ్లీ సెగ్మెంట్లలోనూ కొన్నిచోట్ల మినహా కాంగ్రెస్సే ఆధిక్యతను కనబరిచింది. కాగా బీజేపీ గెలిచిన 8 లోక్‌సభ నియోజకవర్గాల్లోని 56 సెగ్మెంట్లలో బీజేపీతో పాటు కాంగ్రెస్ కూడా కొన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొదటి స్థానంలో నిలిచింది. మూడు చోట్ల బీఆర్ఎస్ మొదటి స్థానంలో నిలిచింది. అయి తే చివరికి స్వల్ప తేడాతోనైనా బీజేపీనే విజయం సాధించింది. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలిచిన 39స్థానాల్లో గజ్వేల్, సిద్దిపేట, దుబ్బాక మినహా మిగతా 36 సెగ్మెంట్లలో ఆపార్టీ ఓట్లను కాంగ్రెస్, బీజేపీ పంచుకొన్నాయి. దీంతో బీఆర్ఎస్ 2,3 స్థానాలకే పరిమితమైంది.

బీఆర్ఎస్‌కు 2 స్థానాల్లోనే రెండో స్థానం

లోక్‌సభ ఎన్నికల్లో ఒక్కచోట కూడా గెలవలేకపోయిన బీఆర్ఎస్ కేవలం మహబూబాబాద్, ఖమ్మం లోక్‌సభ స్థానాల్లో మాత్రమే కాంగ్రెస్ తరువాత రెండోస్థానంలో నిలిచింది. హైదరాబాద్ ఎంపీ స్థానంలో నాలుగో స్థానానికి పరిమితమైన బీఆర్ఎస్ మిగతా 14 చోట్ల మూడో స్థానం దక్కించుకుంది. మెదక్ పార్లమెంటు పరిధిలోని గజ్వేల్, సిద్దిపేట, దుబ్బాక అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్, బీజేపీ కన్నా అధిక ఓట్లు సాధించి మొదటి స్థానంలో నిలిచింది. ఇందులో గజ్వేల్ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం కాగా, సిద్దిపేట స్థానం మాజీ మంత్రి హరీశ్‌రావు కంచుకోట. అయితే బీజేపీ నుంచి పోటీ చేసి గెలిచిన రఘునందన్ రావు సొంత నియోజకవర్గం అయిన దుబ్బాకలో కూడా బీఆర్ఎస్‌కే మెజారిటీ రావడం గమనార్హం.

బీజేపీ వైపు బీఆర్ఎస్ ఓటర్ల మొగ్గు

బీజేపీ గెలిచిన 8 ఎంపీ సీట్లలో చాలాచోట్ల కాంగ్రెస్ రెండోస్థానంలో నిలవగా, బీఆర్ఎస్ మూడోస్థానానికి పరిమితమైంది. 2023లో బీఆర్ఎస్ గెలిచిన స్థానాల్లో కూడా ఈసారి బీజేపీకి మెజారిటీ వచ్చింది. అంటే జాతీయ స్థాయి ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని బీఆర్ఎస్ ఓటర్లు కూడా ఈసారి బీజేపీ వైపే మొగ్గు చూపారన్న మాట. కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న కరీంనగర్ ఎంపీ పరిధిలోని సిరిసిల్ల నియోజకవర్గంలో సైతం బీఆర్ఎస్ రెండోస్థానంలో నిలిచింది. ఇక్కడ బీజేపీకి మెజారిటీ ఓట్లు రావడం గమనార్హం. కరీంనగర్ లోక్‌సభ పరిధిలో గత అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన కరీంనగర్, హుజూరాబాద్ సెగ్మెంట్లలో బీఆర్ఎస్ మూడోస్థానంలో నిలిచింది. కరీంనగర్ పరిధిలో మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రాతినిధ్యం వహిస్తున్న హుస్నాబాద్ సెగ్మెంట్‌లో మాత్రం కాంగ్రెస్ మొదటి స్థానంలో నిలవగా, బీజేపీ, బీఆర్ఎస్ రెండు, మూడుస్థానాలు దక్కించుకున్నాయి. నిజామాబాద్ లోక్‌సభ పరిధిలో బీజేపీ విజయం సాధించగా, ఇక్కడ బీఆర్ఎస్ విజయం సాధించిన బాల్కొండ, కోరుట్ల, జగిత్యాల నియోజకవర్గాల్లో సైతం మూడో స్థానానికే పరిమితమైంది. ఇక హైదరాబాద్ పరిసరాల్లోని చేవెళ్ల, మల్కాజిగిరి, సికింద్రాబాద్ నియోజకవర్గాల్లో బీజేపీ విజయం సాధించగా, 2023 నవంబర్‌లో ఈ మూడు నియోజకవర్గాల పరిధిలో బీఆర్ఎస్ గెలిచిన 18 సీట్లలోనూ లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ మూడో స్థానానికే పరిమితమవడం గమనార్హం.

కాంగ్రెస్ గెలిచిన స్థానాల్లో బీజేపీకే రెండో స్థానం

కాంగ్రెస్ గెలిచిన 8 ఎంపీ స్థానాల పరిధిలోని 56 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 2023 అసెంబ్లీ ఎన్నికల్లో చాలావరకు బీఆర్ఎస్ రెండో స్థానంలో నిలిచింది. కానీ ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో సీన్ మారింది. బీజేపీ బలం ఏమ్రాతం లేని ఖమ్మం, మహబూబాబాద్ ఎంపీ స్థానాలలో మాత్రమే బీఆర్ఎస్ రెండోస్థానంలో నిలవగా, మిగతా ఆరు నియోజకవర్గాల్లో బీజేపీ ప్రధాన ప్రత్యర్థిగా ఉంది. దాదాపు 50 అసెంబ్లీ సెగ్మెంట్లలో కాంగ్రెస్ మొదటి స్థానంలో ఉండి భారీగా ఓట్లు సాధించడం గమనార్హం. పెద్దపల్లి పార్లమెంటు నియోజకవర్గంలోని ఏడు సెగ్మెంట్లలో ధర్మపురిలో మాత్రమే కాంగ్రెస్ కన్నా బీజేపీ స్వల్ప ఆధిక్యత సాధించగా, మిగతా ఆరు చోట్ల కాంగ్రెస్ మొదటి స్థానంలో నిలిచింది. జహీరాబాద్ ఎంపీ పరిధిలోని ఎల్లారెడ్డి, కామారెడ్డి నియోజకవర్గాల్లో బీజేపీ మొదటి స్థానంలో నిలవగా, కాంగ్రెస్‌కు రెండో స్థానం దక్కింది. నాగర్‌కర్నూల్ ఎంపీ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో ఆరు చోట్ల కాంగ్రెస్ ఆధిక్యత సాధించగా, గద్వాలలో మాత్రం కాంగ్రెస్ కన్నా బీజేపీకి ఎక్కువ ఓట్లు పోలవడం గమనార్హం. ఇక వరంగల్, మహబూబాబాద్, నల్లగొండ, భువనగిరి, ఖమ్మం, పార్లమెంటు స్థానాల్లో దాదాపు అన్ని అసెంబ్లీ సెగ్మెంట్లలో కాంగ్రెస్ మొదటి స్థానంలోనే నిలవగా, రెండోస్థానంలో బీజేపీ, మూడోస్థానంలో బీఆర్ఎస్ నిలిచింది.

## ఢిల్లీలో మళ్లీ కీలకంగా చంద్రబాబు

ఢిల్లీ: తెదేపా అధినేత చంద్రబాబునాయుడు దాదాపు మూడు దశాబ్దాల తరువాత మళ్లీ ఢిల్లీలో కీలకంగా మారారు. ఈ నెల 4న వెలువడిన సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో ఎన్డీయే కూటమిలో రెండో అతిపెద్ద పార్టీగా తెలుగుదేశం అవతరించడం, కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటుకు ఆ పార్టీ మద్దతు అవసరమవడంతో జాతీయ మీడియా మొత్తం చంద్రబాబు వైపు మోహరించింది. బుధవారం ఎన్డీయే సమావేశంలో పాల్గొనడానికి ఢిల్లీకి వచ్చిన చంద్రబాబును ఎయిర్‌పోర్టులో కాలు పెట్టినప్పటినుంచి తిరిగి వెళ్లేంతవరకూ అనుసరించింది. భాజపా ఎక్కువ లోక్‌సభ స్థానాల సాధించి అతిపెద్ద పార్టీగా అవతరించినప్పటికీ మెజారిటీ మార్కు 272కు ఇంకా 32 సీట్ల దూరంలో నిలిచిపోవడంతో మిత్రపక్షాల మద్దతు మోదీకి అనివార్యమైంది. గత రెండు పర్యాయాలూ సొంత మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసిన ఆయనకు చంద్రబాబు, నీతీశ్‌కుమార్ లాంటి వారి మద్దతు ఇప్పుడు అనివార్యం కావడంతో జాతీయ మీడియా మొత్తం వీరిద్దరిపైనే దృష్టిసారించి.. వారు ఏం చెబుతారా అని ఆసక్తిగా ఎదురుచూసింది. గతంలో యునైటెడ్ ఫ్రంట్ నేతృత్వంలో దేవేగౌడ, ఐకే గుజ్రాల్ ప్రభుత్వాల ఏర్పాటులో, 1998, 1999లో వాజపేయీ హయాంలో ఎన్డీయే ప్రభుత్వ ఏర్పాటులో చంద్రబాబు కీలకపాత్ర పోషించారు. వాజపేయీ హయాంలో రాష్ట్రపతిగా అబ్దుల్‌కలాంను ప్రతిపాదించడంలోనూ ముఖ్యభూమిక ఆయనదే. ప్రాంతీయపార్టీగా ఉన్నప్పటికీ 1984లో లోక్‌సభలో ప్రధానప్రతిపక్ష పాత్ర పోషించిన తెలుగుదేశం ఆ తర్వాత నుంచి అవసరం వచ్చిన ప్రతిసారీ ఏదో రూపంలో జాతీయపార్టీలతో సమానంగా ఢిల్లీలో కీలకపాత్ర పోషిస్తూ వచ్చింది. వీపీసింగ్, దేవేగౌడ, ఐకే గుజ్రాల్, వాజపేయీ, మోదీ మొదటిదఫా ప్రభుత్వ ఏర్పాటులో భాగస్వామిగా ఉంది. 1991లో పీవీ నరసింహారావు ప్రభుత్వం మనుగడ సాగించడంలోనూ తెదేపా ఎంపీల్లో వచ్చిన చీలిక ప్రధాన భూమిక పోషించింది. 2004, 2009ల్లో మన్మోహన్‌సింగ్, 2019లో మోదీ ప్రభుత్వ ఏర్పాటులో మాత్రమే తెదేపా నామమాత్రంగా ఉండిపోయింది. గతంలో తమ మద్దతుతో ఏర్పడిన ఏ ప్రభుత్వానికీ తెదేపా అర్ధంతరంగా మద్దతు ఉపసంహరించలేదు. 2014లో మోదీకి పూర్తిస్థాయి మెజారిటీ ఉన్న నేపథ్యంలో ప్రత్యేకహోదా అంశంపై మాత్రమే ఏడాది ముందు బయటికొచ్చింది. తరవాత 2019లో ఎవరికి వారు పోటీ చేసి, 2024 ఎన్నికల ముంగిట కలిసి కూటమిగా ఏర్పడి ఏపీలో ప్రభంజనం సృష్టించడంతోపాటు, కేంద్రంలో కీలకభూమిక పోషించే స్థాయిలో ఎంపీ స్థానాలను తెదేపా గెలుచుకుంది. ఈ నేపథ్యంలో చంద్రబాబు ఎన్డీయే కూటమిలో కొనసాగుతారా? ఇండియా కూటమి ఏదైనా మంచి ప్రతిపాదన చేస్తే అటువైపు మళ్లుతారా అన్న చర్చ ఢిల్లీ స్థాయిలో తీవ్రంగా జరగడంతో ఆ విషయంపై స్పష్టత కోసం జాతీయ మీడియా ప్రతినిధులు మొత్తం ఆయన చుట్టూ మూగిపోయారు. ఆయనతో సెల్ఫీలు దిగేందుకు మీడియా ప్రతినిధులు పోటీపడ్డారు.

## ఎన్డీయే నేతగా మోడీ ఏకగ్రీవ ఎన్నికల

**న్యూఢిల్లీ:** ఎన్డీయే పక్షనేతగా నరేంద్రమోదీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు భాగస్వామ్య పార్టీల నేతలు తీర్మానించారు. ఢిల్లీలోని ప్రధాని నివాసంలో జరిగిన సమావేశానికి తెదేపా అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్, జేడీయూ అధ్యక్షుడు నీతీశ్ కుమార్, మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే, భాజపా జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, సీనియర్ నేతలు అమిత్ షా, రాజ్‌నాథ్‌సింగ్, జేడీఎస్ నేత కుమారస్వామి, చిరాగ్ పాశ్వాన్ తదితరులు హాజరయ్యారు. మోదీ సారథ్యంలో పదేళ్లుగా ప్రజాసంక్షేమ విధానాల కారణంగా 140 కోట్ల మంది దేశ ప్రజలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందారు. చాలా సుదీర్ఘ విరామం.. దాదాపు 6 దశాబ్దాల తర్వాత దేశ ప్రజలు వరుసగా మూడోసారి సంపూర్ణ మెజారిటీతో బలమైన నాయకత్వాన్ని ఎన్నుకున్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో మోదీ నేతృత్వంలో ఐక్యంగా పోరాడి గెలిచినందుకు గర్విస్తున్నామని పేర్కొన్నారు. భారతదేశ వారసత్వాన్ని పరిరక్షించడం ద్వారా.. దేశ సర్వతోముఖాభివృద్ధి కోసం, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచడానికి ఎన్డీయే ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని తీర్మానంలో నేతలు పేర్కొన్నారు. కేంద్రంలో బీజేపీ సారథ్యంలో ప్రభుత్వం ఏర్పాటుకు ఎన్డీయే కూటమి ఏకగ్రీవ నిర్ణయం తీసుకుంది. ఎన్డీయే నేతగా నరేంద్ర మోదీ పేరుకు మద్దతు ప్రకటించింది. ప్రభుత్వం ఏర్పాటు, అనుసరించాల్సిన వ్యూహంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నివాసంలో సుమారు గంటన్నర సేపు జరిగిన ఎన్డీయే కీలక సమావేశంలో ఈ నిర్ణయిం తీసుకున్నారు. కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వానికి మద్దతు లేఖలను కూటమి కీలక భాగస్వాములుగా ఉన్న టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు, జేడీయూ నేత నితీష్ కుమార్ అందజేశారు. కాగా, ఎన్డీయే కీలక సమావేశం పూర్తికావడంతో రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలుసుకునేందుకు ఎన్డీయే ప్రతినిధి బృందం సిద్ధమవుతోంది. రాత్రి 7.30 గంటలకు రాష్ట్రపతిని కలుసుకోనున్నారు. నరేంద్ర మోదీ నాయకత్వంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పాటుకు అనుమతించాల్సిందిగా రాష్ట్రపతిని ప్రతినిధి బృందం కోరనుంది. ప్రభుత్వం ఏర్పాటుకు అవసరమైన సంఖ్యాబలం తమకు ఉందంటూ భాగస్వామ్య పార్టీల మద్దతుతో కూడిన లేఖను అందజేయనుంది. మూడోసారి ప్రధానమంత్రిగా మోదీ ఈనెల 8న ప్రమాణస్వీకారం చేసేందుకు నిర్ణయించినట్టు పార్టీ వర్గాల సమాచారం. లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ సొంతంగా 240 సీట్లు గెలుచుకున్నప్పటికీ మెజారిటీకి దూరంగా ఉండిపోయింది. అయితే, బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే కూటమి 292 సీట్లు గెలుచుకోవడంతో ప్రభుత్వం ఏర్పాటుకు అవసరమైన మెజారిటీ మార్క్ 272ను అవలీలగా దాటింది. కాగా, 18వ లోక్‌సభ ఏర్పాటుకు మార్గం సుగమం చేస్తూ, 17వ లోక్‌సభను రద్దు చేయాల్సిందిగా కేంద్ర క్యాబినెట్ బుధవారం ఉదయం నిర్ణయం తీసుకుంది.

## భారాస ఎమ్మెల్యేలు ఆత్మప్రబోధానుసారం వ్యవహరించాలి

హైదరాబాద్: "అసెంబ్లీ ఎన్నికల్లో 39 సీట్లు గెలుచుకున్న భారాస.. లోక్‌సభ ఎన్నికల్లో మూడు శాసనసభ సెగ్మెంట్లలోనే ఆధిక్యం కనబరిచింది. భారాసను అంతర్ధానం చేసి.. భాజపాను గెలిపించేందుకు కేసీఆర్ తమ పార్టీ ఓట్లు బదలాయించారు. భారాస ఎమ్మెల్యేల ఆత్మగౌరవాన్ని కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులు భాజపాకు తాకట్టు పెట్టి.. ఆ పార్టీతో బేరసారాలు సాగిస్తున్నారు. ఇప్పటికైనా భారాస శాసనసభ్యులు తమ ఆత్మప్రబోధానుసారం వ్యవహరించాలి" అని పీసీసీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. భారాసకు పార్లమెంటులో ప్రాతినిధ్యం లేకపోవడం ఇదే మొదటిసారని, ఇంత దుర్భర పరిస్థితి దాపురించిందంటే.. కేసీఆర్ నాయకత్వాన్ని, ఆయన కుటుంబాన్ని తెలంగాణ సమాజం ఎంతగా తిరస్కరిస్తోందో వారు ఆలోచించాలన్నారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఎంపీ ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్ అభ్యర్థులు కడియం కావ్య, మల్లు రవి తదితరులతో కలిసి జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు."మేం అధికారంలోకి వచ్చాక వంద రోజుల్లోనే మాపై అనేక ఆరోపణలు చేసిన భారాసకు తెలంగాణ ప్రజలు లోక్‌సభ ఎన్నికల్లో సున్నా ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టాలని కుట్రపూరితంగా వ్యవహరించినందుకు ప్రజలు పూర్తిగా తిరస్కరించారు. ఇప్పటికైనా కేసీఆర్ తన వ్యవహార శైలి మార్చుకోవాలి. ప్రతిపక్షంగా సహేతుకమైన సలహాలు ఇవ్వాలి. కుటుంబ స్వార్థం కోసం, పార్టీ మనుగడ కోసం, అక్రమంగా సంపాదించుకున్న ఆస్తులను కాపాడుకోవడానికి చేస్తున్న ప్రయత్నాలను ప్రజలు గమనిస్తున్నారు. మీరు ఆత్మాహుతి దళాలుగా మారి కాంగ్రెస్‌ను దెబ్బతీయాలనుకుంటే.. రాష్ట్రంలో, కేంద్రంలో చట్టసభల్లో కనుమరుగై కాలగర్భంలో కలిసిపోతారు" అని హెచ్చరించారు.మా వంద రోజుల పాలనపై ప్రజల్లో విశ్వాసం"శాసనసభ ఎన్నికల్లో 64 నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీని, ఒకచోట మిత్రపక్షమైన సీపీఐని ప్రజలు గెలిపించారు. 39.5 శాతం ఓట్లతో కాంగ్రెస్ ప్రభుత్వానికి, ప్రజా పాలనకు ఆమోదం తెలిపారు. ఆ తర్వాత వంద రోజుల్లో ఆరు గ్యారంటీల్లోని 5 హామీలను అమలు చేసి.. భవిష్యత్ కార్యాచరణను వివరించి.. లోక్‌సభ ఎన్నికల బరిలో దిగాం. ఈ ఎన్నికలు మా వంద రోజుల ప్రజా పాలనకు రెఫరండమని విస్పష్టంగా చెప్పాం. మేమిచ్చిన గ్యారంటీలు, మా పాలన నచ్చితే.. మరింత బలం చేకూర్చేలా తీర్పు ఇవ్వాలని కోరాం. చాలామంది సన్నిహితులు, శ్రేయోభిలాషులు రెఫరండం అనడం సరైంది కాదనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కానీ, ప్రజల పట్ల ఉన్న విశ్వాసం, పార్టీ నాయకులు, కార్యకర్తల పట్ల ఉన్న నమ్మకంతో లోక్‌సభ ఎన్నికలు మా పరిపాలనకు రెఫరండమే అని పునరుద్ఘాటించాను. మా నమ్మకమే ఇప్పుడు నిజమైంది. రాష్ట్రంలోని 17 లోక్‌సభ స్థానాల్లో 8 నియోజకవర్గాలను కాంగ్రెస్ కైవసం చేసుకుంది. అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే ఓట్ల శాతం పెరిగింది. మా పరిపాలన బాగుందని ప్రజలు మెచ్చుకున్నారని ఈ ఫలితాలతో అర్థమవుతోంది. కంటోన్మెంట్ ఉప ఎన్నికలోనూ గెలిపించి.. ప్రజలు మాకు మరో ఎమ్మెల్యే సీటు ఇచ్చారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ 3 సీట్లను గెలుచుకోగా.. ఈ ఎన్నికల్లో 8 సీట్లు ఇచ్చి ఆశీర్వదించారు. లోక్‌సభ ఎన్నికల్లో మేం ఆశించిన దానికంటే కొన్ని సీట్లు తక్కువగా వచ్చాయి. ఈ ఫలితాలు ఉగాది పచ్చడి లాంటివి. ఇప్పటివరకు రోజుకు 18 గంటలు పనిచేశాం. ఇకనుంచి మరో రెండు గంటలు అదనంగా పనిచేస్తాం. రాష్ట్రంలో పార్టీ జయాపజయాలకు పూర్తి బాధ్యత నాదే.భాజపా కోసం భారాస ఆత్మబలిదానం

2019లో భాజపా 4 ఎంపీ సీట్లలో గెలిస్తే.. ఈ ఎన్నికల్లో 8 స్థానాల్లో విజయం సాధించింది. అసెంబ్లీ ఎన్నికల్లో 13.90 శాతం ఓట్లు రాగా.. ఈ ఎన్నికల్లో 35 శాతానికి పెంచుకుంది. భాజపాను గెలిపించేందుకు భారాస నాయకులు ఆత్మబలిదానం చేసుకున్నారు. 2001లో తెదేపాకు కేసీఆర్ రాజీనామా చేసి, సిద్దిపేటలో ఎమ్మెల్యేగా పోటీ చేసినప్పటి నుంచి.. 2023 డిసెంబరు వరకూ సిద్దిపేట శాసనసభ నియోజకవర్గంలో ప్రతిసారీ భారాసకు 25-30 వేల నుంచి 1.20 లక్షల వరకూ మెజారిటీ వచ్చింది. ఈ లోక్‌సభ ఎన్నికల్లో హరీశ్‌రావు తన ఓట్లను పూర్తిగా భాజపాకు బదిలీ చేశారు. సిద్దిపేట సెగ్మెంట్‌లో భారాస అభ్యర్థికి సుమారు 65 వేల ఓట్లు వస్తే.. భాజపా అభ్యర్థి రఘునందన్‌రావుకు 63 వేలు వచ్చాయి. ఇక్కడ భారాస 2,500 ఓట్లు మాత్రమే ఎక్కువగా సాధించింది. ఇప్పటివరకూ సిద్దిపేట నియోజకవర్గంపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించిన భారాస.. కేసీఆర్, హరీశ్‌రావులు తమ ఓట్లను భాజపాకు బదిలీ చేయించడం ద్వారా బలహీనవర్గాలకు చెందిన అభ్యర్థిని ఓడించారు. భారాస అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని నమ్మించి మోసం చేశారు. సిద్దిపేటలో తక్కువ ఓట్లు రావడం వల్లే మెదక్ లోక్‌సభ స్థానంలో మేం ఓడిపోయాం. అసెంబ్లీ ఎన్నికల్లో 37.5 శాతం ఓట్లు పొందిన భారాస.. ఈ ఎన్నికల్లో 16.5 శాతానికి పడిపోయింది. 21 శాతం భారాస ఓట్లను భాజపాకు బదిలీ చేశారు. తద్వారా 8 లోక్‌సభ స్థానాల్లో భాజపా గెలిచింది. వీటిలో ఏడింటిలో భారాస డిపాజిట్లనూ కోల్పోయింది. ఫీనిక్స్ పక్షిలాగా మళ్లీ పుంజుకుంటామని కేటీఆర్ అంటున్నారు. ఇప్పుడు బూడిదయ్యారు. మళ్లీ పుట్టేదేమీ లేదు. ఇక బూడిదే మీకు మిగిలింది. మోదీ కరిష్మాకు కాలం చెల్లింది

కేంద్రంలో 2014, 2019లలో తమ విధానం, సిద్ధాంతం, మ్యానిఫెస్టోపై భాజపా నేతలు ఓట్లు అడిగారు. ఈ ఎన్నికల్లో మోదీ గ్యారంటీ పేరుతో ఏక వ్యక్తి నాయకత్వంలో వారు ప్రజల్లోకి వెళ్లారు. దీంతో సీట్ల సంఖ్య 303 నుంచి 240కి పడిపోయింది. మోదీ గ్యారంటీకి వారంటీ అయిపోయిందని, ఆయన కరిష్మాకు కాలం చెల్లిందని ప్రజలు తీర్పు ఇచ్చారు. రాముడి పేరు మీద ఓట్ల అడిగిన భాజపాకు దేవుడు కూడా గుణపాఠం చెప్పాడు. ఈ ఎన్నికల్లో ఎన్‌డీఏకు 42.9 శాతం ఓట్లు వస్తే.. ఇండియా కూటమికి 41.1 శాతం అంటే దాదాపు సమానంగా వచ్చాయి. సీట్లు కూడా పోటాపోటీగా వచ్చాయి. 140 కోట్ల ప్రజల తిరస్కరణకు గురైన మోదీ మళ్లీ ప్రధాని పదవి చేపట్టకూడదు. ఇది 4 కోట్ల తెలంగాణ ప్రజల పక్షాన కాంగ్రెస్ పార్టీ నాయకుడిగా చేస్తున్న డిమాండ్. విలువలు కలిగిన నాయకుడిగా.. సమాజానికి ఆదర్శంగా ఉండాల్సిన వ్యక్తిగా.. హుందాగా రాజీనామా చేసి తప్పుకొంటే ఆయనకు గౌరవం ఉంటుంది. మూడోసారీ ప్రధానిగా ఉంటానని, కుట్రలు, కుతంత్రాలు చేస్తూనే ఉంటానని అంటే.. వారు చెబుతున్న రాజకీయ విలువలు చెప్పడానికి మాత్రమేనని, ఆచరించడానికి కాదని దేశ ప్రజలు విశ్వసించాల్సి వస్తుంది.

ప్రభుత్వాన్ని కూల్చే కుట్రను కేసీఆర్ చేస్తూనే ఉంటారుప్రభుత్వాన్ని కూల్చే కుట్రను కేసీఆర్ నిరంతరం చేస్తూనే ఉంటారు. ఆయన ఒక రాజకీయ జూదగాడు.



# క్రికెట్ ఆడుతూ...
# గుండెపోటుతో యువకుడు మృతి.



**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, జూన్ 5:**

క్రికెట్ ఆడుతూ ఉన్నట్టుండి కుప్పకూలి యువకుడు మృతిచెందిన ఘటన నగరంలో చోటు చేసుకుంది. గౌతంనగర్కు చెందిన విజయ్(30) బుధవారం అమ్మ వెంచర్లో క్రికెట్ ఆడేందుకు వెళ్లాడు. అక్కడ స్నేహితులతో కలిసి సరదాగా క్రికెట్ ఆడుతుండగా గుండెపోటు రావడంతో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. స్నేహితులు వెంటనే జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినా మార్గమధ్యలోనే విజయ్ మరణించాడు.

# బీడి" వేతనాల పెంపు కార్మికుల విజయం.

## తెలంగాణ బహుళజన బీడీకార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు యస్. సిద్దిరాములు

## కార్మిక నాయకులకు ప్యాకర్లు ఘనంగా సన్మానం.





**వేగుచుక్క న్యూస్, దోమకొండ, పాల్వంచ, జూన్ 5**

బీడి పరిశ్రమలో వేతనాల పెంపు కార్మికుల విజయం అని, ఐక్య పోరాటం వల్లే యాజమాన్యాలు దిగి వచ్చి వేతనాలు పెంచారని తెలంగాణ బహుళజన బీడీకార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు యస్. సిద్దిరాములు అన్నారు. దోమకొండ మండలలోని దేశాయి బీడి కంపెనీలో ప్యాకర్లు బుధవారం ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వేతనాల పెంపు కోసం కృషి చేసిన తెలంగాణ బహుళజన బీడీ కార్మిక సంఘం(బిఎల్ టీయూ) రాష్ట్ర అధ్యక్షులు యస్. సిద్దిరాములు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం. ఆంజనేయులు ను కార్మికులు ఘనంగా సన్మానించారు. అదేవిధంగా పాల్వంచ మండలంలోని ఎంఎస్ లంగర్, పర్దిపేట్ లోని దేశాయి బీడి సెంటర్లలో ప్యాకర్లు టేకేదార్లు ఉత్సవాలు జరుపుకొని, కార్మిక నాయకులు సిద్ధిరాములును సన్మానించారు.

ఈ సందర్భంగా తెలంగాణ బహుళజన బీడీకార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు యస్. సిద్దిరాములు మాట్లాడారు.

తెలంగాణ రాష్ట్రంలోని బీడీ పరిశ్రమ లో పనిచేస్తున్న దాదాపు 8 లక్షల మంది బీడీ కార్మికులకు, బీడీ ప్యాకర్లకు, బట్టి, చటన్, నెలసరి ఉద్యోగులు, బుర్రలు పెట్టె కార్మికులకు ప్రతి రెండు సంవత్సరాలకు ఒక్కసారి, మూల వేతనాలు పెంచాల్సి ఉందన్నారు. గత ఒప్పందం ఏప్రిల్ 31ముగిసిందన్నారు. దీనితో తమ సంఘంతో పాటు ఇతర కార్మిక సంఘాలు వేతనాల పెంపు కోసం యాజమాన్యాలకు డిమాండ్ నోటీసు ఇవ్వడం జరిగిందన్నారు. స్పందించిన బీడీ యాజమాన్యం మే 25న హైదరాబాద్ లో సుమారు 7 గంటల పాటు చర్చలు జరిపి వేతనాలు పెంచడం జరిగిందని వివరించారు. బీడీ కార్మికులకు వెయ్యి బీడీ కార్మికులకు, ప్రస్తుతం ఉన్న వేతనం రూ" 4-25 పైసలు, బీడీ యాజమాన్యం పెంచారని అన్నారు. అలాగే బీడీ ప్యాకర్లకు ప్రస్తుతం ఉన్న వేతనంపై నెలకు రూ" 3650, బట్టి, చటన్, నెలసరి ఉద్యోగులకు రూ" 1700 పెంచారని అన్నారు.

ప్రత్యేకంగా ఎంఎస్ లంగర్ బీడీ కంపెనీ యాజమాన్యంతో జరిగిన చర్చల్లో బీడీ కట్టలకు బుర్ర లు (బాక్స్) పెట్టె కార్మికులకు నెలకు రూ" 1600 పెంచుకోవడం జరిగిందన్నారు. కార్మికుల పక్షాన తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం, (బిఎల్ టీయూ) పోరాడి వేతనాలు పెంపుకు కృషి చేశామని తెలిపారు. ఈ కార్యక్రమం లో తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం కామారెడ్డి జిల్లా అధ్యక్షులు కుమ్మరి రవి, దోమకొండ దేశాయి బీడీ సెంటర్ బీడీ ప్యాకర్లు రాజాశేఖర్, చటన్ కార్మికులు బండారి శంక్కర్, చంద్ర మౌళి, తెలంగాణ బహుళ జన బీడీ టేకేదార్ యూనియన్, కామారెడ్డి జిల్లా నాయకులు యస్. రాంచేంద్రం, పాల్వంచ ఎంఎస్ లంగర్ బీడీ ప్యాకర్లు యెల్లయ్య, శంశు, దుర్గయ్య, రాజు, అంజనేయులు, చటన్ కార్మికులు బాస్కర్, గణేష్, అశోక్, శంకర్, పద్మ, చందన, రమేష్, బీడీ కట్టలకు బుర్రలు పెట్టె కార్మికులు నిచిత, లక్ష్మి, రాజవ్వ, యెల్లలక్ష్మి, పద్మా, బుజ్జి, పరిదిపేట్ దేశాయి బీడీ సెంటర్ బీడీ ప్యాకర్లు రాజు, వెంకటి, కృష్ణ, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



# గ్రూపు -1 పరీక్షను పగడ్బందీగా నిర్వహించాలి.

## - జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్.

**వేగుచుక్క న్యూస్,కామారెడ్డి : జూన్ 5:**



ఈ నెల 9న నిర్వహించే గ్రూపు -1 ప్రిలిమినరీ పరీక్ష పగడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఆయన చీఫ్ సూపర్డెంట్లు, బయోమెట్రిక్ శిక్షణ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. బయోమెట్రిక్ చేసే విధానంపై అధికారులతో శిక్షణ ఇప్పించినట్లు తెలిపారు. జిల్లాలో 12 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 4792 మంది అభ్యర్థులు జిల్లాలో పరీక్ష రాయనున్నారని తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో అభ్యర్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. బయోమెట్రిక్ యంత్రాలు ఒక రోజు ముందు జిల్లాకు వస్తాయని, వాటిని పరీక్షించి ఎలాంటి అసౌకర్యం కలగకుండా పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. సీసీ కెమెరాల ఏర్పాటుతోపాటు పరీక్ష సజావుగా నిర్వహించేందుకు 12 మంది చీఫ్ సూపర్డెంట్ లను, పర్యవేక్షకులను, రూట్ అధికారులను నియమించినట్లు తెలిపారు. అధికారులకు పరీక్షకు సంబంధించి సామాగ్రిని అందజేశారు. పరీక్ష కేంద్రంలోకి వచ్చే మహిళ, పురుష అభ్యర్థులను తనిఖీ చేయుటకు పోలీస్ శాఖ ద్వారా తగిన ఏర్పాట్లను చేయాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల సమీపంలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని వెల్లడించారు. సమావేశంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చంద్రమోహన్, పరీక్షల రీజనల్ కోఆర్డినేటర్ విజయ్ కుమార్, అధికారులు పాల్గొన్నారు.



# అమెరికా ఈసీఎస్ సమావేశంలో పాల్గొన్న వైద్యురాలు.

## - అభినందించిన జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమారాజ్.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, జూన్ 5:**

అమెరికాలో ఇటీవల నిర్వహించిన ఈసీఎస్ సమావేశంలో భారత్ తరపున జిల్లా జనరల్ ఆస్పత్రి సీనియర్ రెసిడెంట్(పాథాలజీ) వైద్యురాలు ఉమాదేవి పాల్గొన్నారు. కాలిఫోర్నియాలో జరిగిన 245వ సమావేశంలో పలు అంశాలపై అంతర్జాతీయ నిపుణులతో చర్చించారు. అలాగే తాను పరిశోధించిన రెండు అంశాలను సమర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉమాదేవిని జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమారాజ్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ వివి.రావు, డాక్టర్ ఇమ్రాన్ సన్మానించారు. జిల్లా నుంచి అంతర్జాతీయ సదస్సులో పాల్గొనడం గొప్ప విషయమని అన్నారు.

# బిఆర్ఎస్ ఛాప్టర్ క్లోజ్ మంత్రి కోమటిరెడ్డి వ్యాఖ్యలు

**హైదరాబాద్:** బై బై బీఆర్ఎస్ అంటూ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వ్యాఖ్యానించారు. నాలుగు నెలలకే రెఫరెండం అని ప్రజల్లోకి వెళ్లి ఓటు శాతం పెంచుకున్నామన్నారు. బీఆర్ఎస్ సిట్టింగ్ స్థానం గెలుచుకోవడం సంతోషంగా ఉందన్నారు. బీఆర్ఎస్ నేతలు ఆవేదనలో, బాధలో ఉన్నారన్నారు. కేసీఆర్ బస్సు ఎక్కి తిరిగినా డిపాజిట్లు కూడా రాలేదన్నారు. బీఆర్ఎస్ అధ్యాయం ముగిసిందని.. కేసీఆర్ తన పార్టీ క్లోజ్ చేసుకుంటే మంచిదన్నారు. ఈ రిజల్ట్‌తో మాలో ఆత్మ విశ్వాసం పెరిగిందన్నారు. ఇకపై ఏ ఎన్నికలు వచ్చినా మా టీమ్ లీడర్ రేవంత్ నాయకత్వంలో క్లీన్ స్వీప్ చేస్తామన్నారు. 15 ఏళ్లు అధికారంలో తామే ఉంటామని కోమటిరెడ్డి వెల్లడించారు.

# థర్డ్ డిగ్రీ ప్రయోగించిన ఎస్పీ ఇంటికి పట్టాభి

## జాషువా లేకపోవడంతో వెనుదిగిన టిడిపి నేత

**అమరావతి:** ఏపీ సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి ఘన విజయం సాధించిన క్రమంలో ఇప్పటికే అధికారులు సర్దుకుంటున్నారు. కొన్నిచోట్ల విచిత్ర ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఎన్నికల్లో వైసీపీ కేవలం11 సీట్లు సాధించి ఘోర ఓటమి చవిచూసింది. ఈ ఫలితాలతో వైసీపీకి కొమ్ముకాసిన అధికారుల్లో భయం మొదలైనట్లు కనిపిస్తోంది. టీడీపీ అధినేత చంద్రబాబు, కీలక నేతలపై అక్రమ కేసులు పెట్టించిన వైసీపీ ముఖ్య నేతలు కొంతమంది విదేశాలకు వెళు న్నారని సమాచారం. వారికి సహకరించిన అధికారులు కూడా ఒక్కొక్కరిగా రాజీనామాల బాట పడుతున్నారు. మరి కొంతమంది అధికారులు అండర్ గ్రౌండ్‌లోకి వెళ్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే 2023లో కృష్ణా జిల్లా ఎస్పీగా పనిచేసిన జాషువా

గురించి కూడా చర్చ జరుగుతోంది. ఇప్పటికే తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ తప్పుచేసిన అధికారులను వదలిపెట్టబోమని హెచ్చరించిన విషయం తెలిసిందే. వైసీపీకి వత్తాసు పలికిన అధికారుల లిస్ట్‌ను తాను రెడ్‌బుక్‌లో ఎక్కించుకున్నట్లు కూడా వార్నింగ్ ఇచ్చారు. టీడీపీ నేతలపై అక్రమ కేసులు పెట్టిన అధికారులు అయితే తెలుగుదేశం పార్టీ జాతీయ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభి రామ్‌పై కూడా అప్పటి కృష్ణా జిల్లా ఎస్పీ జాషువా అక్రమ కేసులు బనాయించి థర్డ్ డిగ్రీ ప్రయోగించారని పలుమార్లు తన ఆవేదనను వ్యక్తం చేశారు. ఈ క్రమంలో బుధవారం జాషువాని మర్యాదపూర్వకంగా కలిసేందుకు వెళ్లారు. ఈ సందర్భంగా పట్టాభి రామ్ మీడియాతో మాట్లాడారు. నన్ను అక్రమంగా నిర్బంధించి రాచమర్యాదలు చేసిన అప్పటి కృష్ణ జిల్లా ఎస్పీ జాషువా గారిని మర్యాదపూర్వకంగా కలిసేందుకు వచ్చా. 2023 ఫిబ్రవరి 20 వ తేదీన కృష్ణా జిల్లా తోట్లవల్లూరు పోలీస్ స్టేషన్‌లో ఒక అక్రమకేసులో నన్ను నిర్బంధించి చిత్రహింసలకు గురిచేశారు. అర్ధరాత్రి కరెంటు తీసేసి జాషువా థర్డ్ డిగ్రీ ప్రయోగించారు. ఆయనను కలిసి బొకే ఇచ్చేందుకు అతని నివాసానికి వచ్చా. విజయవాడ సమీపంలో తన ఏడున్నర ఎకరాల్లో ఉన్న విలాసవంతమైన అతిథి గృహంలో ఉన్నారని తెలుసుకుని వచ్చా. పుష్పగుచ్ఛం, శాలువాతో సత్కారం చేద్దామని వచ్చాను. అయితే అతను ఇక్కడ లేరని, నిన్న ఫలితాలు వెలువడిన దగ్గర నుంచి ఆయన సెల్ ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి వెళ్లిపోయారని వాచ్‌మెన్ చెప్పారు.

# సలహాదారు పదవికి సజ్జల రాజీనామా

**అమరావతి:** అసెంబ్లీ ఎన్నికల్లో వైకాపా ఘోరంగా ఓడిపోవడంతో పలువురు ప్రభుత్వ సలహాదారులు తమ పదవులకు రాజీనామాలు చేశారు. జగన్ ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన సజ్జల రామకృష్ణారెడ్డితో సహా 20 మందికి పైగా సలహాదారులు తమ పదవులకు రాజీనామా చేస్తున్నట్లుగా సీఎస్ జవహర్‌రెడ్డికి లేఖలు పంపారు. జాతీయ మీడియా సలహాదారు దేవులపల్లి అమర్, ఉన్నత విద్యామండలి ఛైర్మన్ హేమచంద్రారెడ్డి తదితరులు ఇప్పటికే తమ రాజీనామా లేఖలు సమర్పించారు. ఫలితాలు వెలువడిన వెంటనే తితిదే ఛైర్మన్ పదవికి భూమన కరుణాకర్‌రెడ్డి రాజీనామా చేశారు. తనను రిలీవ్ చేయాలని సమాచార పౌర సంబంధాలశాఖ కమిషనర్ తుమ్మా విజయ్ కుమార్ రెడ్డి ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. ఎన్నికల ఫలితాలకు ముందు పదవీ కాలాన్ని పొడిగించాలని ఆయన ప్రభుత్వానికి దరఖాస్తు పంపించడం గమనార్హం.

# సైబర్ నేరాలపై అవగాహన

**కామారెడ్డి:** సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఇండియన్ సైబర్ క్రైంల ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ప్రతీ నెల మొదటి బుధవారం సైబర్ జాగృతి దివాస్ నిర్వహించాలని నిర్ణయించారు. ఈ మేరకు బుధవారం కామారెడ్డి జిల్లా పెద్దకొడప్గల్ మండల కేంద్రంలో ప్రజలకు, విద్యార్థులకు ఏఎస్సై రాములు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చిన ఫోన్ కాల్స్, వ్యక్తిగత వివరాలను పంచుకోకూడదని తెలిపారు. ఉచిత భహుమతులకు ఆశపడకుండా జాగ్రత్త పడాలని సలహాలు, సూచనలు చేశారు. సైబర్ క్రైంకు గురైనట్లు అనిపిస్తే బాధితులు వెంటనే 1930 నంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయొచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిబ్బంది సాయిశివ, సంజీవ్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

# అర్వింద్ గెలుపునకు కాంగ్రెస్ పరోక్ష మద్దతు

**బిఆర్ఎస్ ఎంపి అభ్యర్థి బాజిరెడ్డి విమర్శలు**

**నిజామాబాద్:** జపా గెలవడానికి కాంగ్రెస్ అవలంబించిన విధానాలే కారణమని భారాస ఎంపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ఆరోపించారు. గత ఎన్నికల్లో భాజపాకు సహకరించిన జీవన్‌రెడ్డిని అభ్యర్థిగా నిలపడం, అర్వింద్‌కు సన్నిహితంగా ఉండే బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి ఇన్‌ఛార్జి బాధ్యతలు ఇవ్వడమే ఇందుకు నిదర్శనమన్నారు. గత ఎన్నికల్లో జీవన్‌రెడ్డి భాజపాకు ఓట్లు వేయించడాన్ని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అదే అలవాటుగా మళ్లీ కమలం గుర్తుకు ఓట్లు వేశారన్నారు. తమ పార్టీ ఇతరులకు సహకరించినట్లు ఆరోపణలు చేయటం సరికాదన్నారు. తమది ఉద్యమ పార్టీ అని..ప్రజల తరఫున పోరాడి మళ్లీ అధికారంలోకి వస్తామన్నారు. భారాసకు ఆదరణ లభించకపోవడానికి కారణం ప్రజలు జాతీయ ఎన్నికలు అనే భావనతో ఓట్లేశారన్నారు. మత విద్వేషాలతో భాజపా గెలుస్తోందని ఆరోపించారు. తెలంగాణకు భారాసనే శ్రీరామ రక్ష అని చెప్పారు. తనకు ఓట్లు వేసిన వారికి, కష్టపడిన కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

# అసోంను వదలని వరదలు 25కు చేరిన మృతుల సంఖ్య

**గౌహతి:** రెమాల్ తుపాన్ కారణంగా భారీ వర్షాలు, వరదలతో ఈశాన్యంలోని పలు రాష్ట్రాలు అతలాకుతలమవుతున్నాయి. ఆ క్రమంలో అసోంలో కురిసిన భారీ వర్షాలకు, వరదలకు మరణించిన వారి సంఖ్య 25కు చేరింది. కాక్రా జిల్లాలో అయిదుగురు నీటి మునిగి మరణించారు. అలాగే నాగవ్ జిల్లాలో మహిళ మృతి చెందింది. ఈ మేరకు ఆ రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ బుధవారం వెల్లడించింది. ఈ వరదల వల్ల 10 జిల్లాల్లోని మొత్తం 4.23 లక్షల మంది ప్రజలు రాశ్రయులయ్యారని తెలిపింది.




# అర్వింద్ గెలుపునకు కాంగ్రెస్ పరోక్ష మద్దతు బిఆర్ఎస్ ఎంపి అభ్యర్థి బాజిరెడ్డి విమర్శలు

**నిజామాబాద్:** భాజపా గెలవడానికి కాంగ్రెస్ అవలంబించిన విధానాలే కారణమని భారాస ఎంపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ఆరోపించారు. గత ఎన్నికల్లో భాజపాకు సహకరించిన జీవన్‌రెడ్డిని అభ్యర్థిగా నిలపడం, అర్వింద్‌కు సన్నిహితంగా ఉండే బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి ఇన్‌ఛార్జి బాధ్యతలు ఇవ్వడమే ఇందుకు నిదర్శనమన్నారు. గత ఎన్నికల్లో జీవన్‌రెడ్డి భాజపాకు ఓట్లు వేయించడాన్ని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అదే అలవాటుగా మళ్లీ కమలం గుర్తుకు ఓట్లు వేశారన్నారు. తమ పార్టీ ఇతరులకు సహకరించినట్లు ఆరోపణలు చేయటం సరికాదన్నారు. తమది ఉద్యమ పార్టీ అని..ప్రజల తరఫున పోరాడి మళ్లీ అధికారంలోకి వస్తామన్నారు. భారాసకు ఆదరణ లభించకపోవడానికి కారణం ప్రజలు జాతీయ ఎన్నికలు అనే భావనతో ఓట్లేశారన్నారు. మత విద్వేషాలతో భాజపా గెలుస్తోందని ఆరోపించారు. తెలంగాణకు భారాసనే శ్రీరామ రక్ష అని చెప్పారు. తనకు ఓట్లు వేసిన వారికి, కష్టపడిన కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.



# రగులుతున్న ఉక్రెయిన్



**కీవ్/మాస్కో:** వరుస రాకెట్ దాడులు, పేలుళ్లతో ఉక్రెయిన్ రగులుతోంది. దేశ రాజధాని కీవ్‌లో జరిగిన పేలుళ్లలో టివి టవర్ దెబ్బతిందని, ఆర్గురు పౌరులు చనిపోయారని రష్యన్ టెలివిజన్ తెలిపింది. ఖర్కివ్‌పై జరిగిన క్షిపణి దాడుల్లో పలు ప్రభుత్వ భవనాలు, వాహనాలు ధ్వంసమయ్యాయి. ఒక చిన్నారి సహా ఎనిమిదిమంది పౌరులు, 70 మంది దాకా సైనికులు చనిపోయినట్లు ఉక్రెయిన్ అధికారులు తెలిపారు. మరో పేలుడు ఘటనలో కర్ణాటక విద్యార్థి ఒకరు చనిపోయినట్లు భారత విదేశాంగ శాఖ మంగళవారం ధ్రువీకరించింది. మరోవైపు తమ లక్ష్యం పూర్తయ్యేదాకా సైనిక ఆపరేషన్ కొనసాగుతుందని రష్యా ప్రకటించింది. మరో వైపు యూరోపియన్ యూనియన్‌లో సభ్యత్వం కోసం ఉక్రెయిన్ చేసిన అభ్యర్థనను ఇయు ఆమోదించింది. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ ఇయు పార్లమెంటునుద్దేశించి ప్రసంగిస్తూ, తమను ఒంటరి చేయొద్దని వేడుకున్నారు. ఉక్రెయిన్‌కు ఇయు సాయం కావాలని కోరారు. మరో వైపు రెండవ దఫా శాంతి చర్చలు గురువారం నిర్వహించేందుకు రష్యా, ఉక్రెయిన్ ప్రతినిధులు సిద్ధమవుతున్నారు. అణు యుద్ధం వచ్చే ప్రమాదముందని, దీనిని ఎదుర్కొనేందుకు అణు దళాలు అప్రమత్తంగా ఉండాలని రష్యా అధ్యక్షుడు పుతిన్ ఆదేశించారు. 40 మైళ్ల పొడవునా రష్యన్ యుద్ధట్యాంకులతో కూడిన భారీ వాహన శ్రేణి ఖర్కివ్‌కు ఉత్తర దిశగా దూసుకొస్తున్నట్లు శాటిలైట్ దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. రష్యన్ బలగాలే ఈ క్షిపణి దాడులకు పాల్పడినట్లు ఉక్రెయిన్ ప్రకటించింది.

ఎనిమిందిమంది పౌరులు మరణించారని తెలిపింది. స్థానిక ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని ఆదేశించింది.


గత గురువారం రష్యా సైనిక ఆపరేషన్ చేపట్టిననాటి నుంచి ఇప్పటి వరకూ 352 మంది పౌరులు చనిపోయారని, వీరిలో 14 మంది చిన్నారులున్నారని ఉక్రెయిన్ ప్రభుత్వం తెలిపింది.

# స్త్రీలను గౌరవిద్దాం.....

నేను ఒక మనిషిగా నా తోటి మనిషి గురించి మాట్లాడాలనుకుంటున్నాను. నా దురదృష్టం ఏమిటంటే ఆ మనిషి ఒక స్త్రీ అయ్యింది. స్త్రీకి నేడు సమాజంలో ఉన్న ప్రాముఖ్యత గురించ చెప్పదలచుకున్నాను. ఈ సందర్భంగా భారతీయ సంస్కృతి గురించి మాట్లాడితే భారతీయ సంస్కృతి చాలా గొప్పది.మహోన్నతమైనదని మేధావులు చరిత్రకారులు మొదలుకొని ఉపాధ్యాయుని వరకు భారతీయ సంస్కృతిని ప్రశంసిస్తారు. కానీ వాళ్లు గొప్పది అనుకుంటున్న ఈ భారతీయ సంస్కృతిలో మహోన్నతమైనది అని చెబుతున్న ఈ దేశంలో నేటికీ స్త్రీలకి స్వాతంత్ర్యం లభించడం లేదు. భయపడకుండా, తోడు లేకుండా బయటికి వచ్చే పరిస్థితి లేదు నేటి సమాజంలో. దీన్నిబట్టి స్త్రీలకి ఇచ్చే విలువ మనకు తెలుస్తున్నది. మన శరీరంలో ఒక కన్ను పొడి చేసుకుని మరో కన్ను బాగుగా ఉంటే నీకు సంపూర్ణ దృష్టి ఉన్నట్లు కాదు. అదేవిధంగా వేల సంవత్సరాల నాగరికత ఉన్నటువంటి భారతదేశంలో స్త్రీలకు గౌరవం లేదు. అలాంటిది ఎలా గొప్ప నాగరికత అవుతుంది. దయచేసి చరిత్రకారులు మౌనం వహించండి. మీకు తెలిసిన ఒకటో రెండో కులాల పేర్లు చెప్పి ఆ కాలంలో స్త్రీలు గౌరవించబడ్డారు. గొప్ప ఉన్నతి పొందారు అని చెప్పవద్దు. ఎందుకంటే ఒక రోజులో ఒక గంట బాగా నవ్వి మిగతా సమయమంతా ఏడుస్తూ గడిపితే అది ఇది మంచి రోజు అవ్వదు ఒక్క విషయం గమనించాలి.

# రష్యా సహకారం లేకుండా ఐఎస్ఎస్ నిర్వహణ ఎలా?

వాషింగ్టన్ : అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్) నిర్వహణలో తమ సహకారం లేకుంటే అది కక్ష్య తప్పి భారత్, చైనా లేదా అమెరికా, ఐరోపా దేశాల్లో పడొచ్చని రష్యా ఇటీవల కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ నేపథ్యంలో ఆ దేశం సహకారం లేకుండా ఐఎస్ఎస్ నిర్వహణపై అమెరికా దృష్టి పెట్టింది. రష్యా సాంకేతిక సాయం లేకుండా ఐఎస్ఎస్‌ను కక్ష్య తప్పకుండా ఉండేలా చూసేందుకు అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ (నాసా) మార్గాలు అన్వేషిస్తున్నది. దేశంలోని ఏరోస్పేస్ సంస్థ 'నార్త్‌రోప్ గ్రుమ్మాన్' రీబూస్ట్ సామర్థ్యాన్ని ఆఫర్ చేసిందని నాసా మానవ అంతరిక్ష ప్రయాణ కార్యక్రమ అధిపతి కాథీ లూడర్స్ పేర్కొన్నారు. సహకరించేందుకు స్పేస్ఎక్స్ అధిపతి ఎలాన్ మస్క్ కూడా సంసిద్ధత వ్యక్తం చేశారని తెలిపారు. అయితే ఐఎస్-ఎస్ నిర్వహణలో భాగస్వామ్యపక్షాలు కట్టుబడి లేరని చెప్పేందుకు దాని నిర్వహణలో ఎటువంటి మార్పులు కనిపించలేదని, అయినప్పటికీ మరింత నిర్వహణ సౌలభ్యం కోసం ఎప్పుడూ చూస్తూ ఉంటాం అని చెప్పారు. ఐఎస్ఎస్ నిర్వహణలో అమెరికాతో పాటు రష్యాది కీలక పాత్ర. అమెరికా పవర్, లైఫ్ సపోర్టు అందిస్తుండగా.. ఐఎస్ఎస్ నిర్దేశిత కక్ష్యలో తిరిగేందుకు ప్రొపల్షన్ వ్యవస్థను రష్యానే అందిస్తున్నది. ఉక్రెయిన్‌పై దాడి నేపథ్యంలో అమెరికా రష్యాపై ఆర్థిక ఆంక్షలతో అంతరిక్ష కార్యక్రమాలకు సంబంధించిన టెక్నాలజీ బదిలీలపై కూడా నిషేధించింది. దీనిపై రష్యా అంతర్జాతీయ పరిశోధనా సంస్థ చీఫ్ దిమిత్రీ రొగొజిన్ ఘాటుగా స్పందించారు. ఐఎస్ఎస్ నిర్వహణ భాగస్వామ్యం నుంచి రష్యా తప్పుకునే అంశాన్ని లేవనెత్తారు. 'మీరు రష్యాకు సహకారాన్ని నిరోధించినట్లయితే.. ఐఎస్ఎస్‌ను ఎవరు రక్షిస్తారు? ఇది కక్ష్య తప్పకుండా.. అమెరికా, యూరప్‌లపై పడకుండా ఎవరు కాపాడుతారు? దాదాపు 500 టన్నుల బరువుండే ఐఎస్ఎస్ భారత్, చైనాలపై కూడా పడే అవకాశం ఉన్నది' అని హెచ్చరించారు.



## రష్యాపై నాటో కూటమి ఆర్థిక దాడి!

అమెరికా ఆధ్వర్యంలోని నాటో కూటమి కుట్రల కారణంగా ఉక్రెయిన్-రష్యా దేశాల మధ్య తలెత్తిన వివాదం విచారకరమైన యుద్ధానికి దారి తీసి బుధవారం నాటికి ఏడవ రోజులో ప్రవేశించింది. రష్యా సైనిక పాటవం ముందు ఉక్రెయిన్ నిలిచే అవకాశం లేదని, త్వరగానే పతనం అవుతుందన్న అంచనాలు తప్పాయి. ఎవరి తురుపు ముక్కలను వారు ప్రయోగిస్తున్నారు. వస్తున్న వార్తలను బట్టి సామాన్య జన నష్టం జరగకుండా చూసేందుకు రష్యన్ దళాలు కేవలం నిర్దేశిత సైనిక కేంద్రాల మీదనే కేంద్రీకరించటం ఒక ప్రధాన కారణంగా కనిపిస్తోంది. నాటో అందచేసిన ఆధునిక ఆయుధాలు కూడా ఉక్రెయిన్ మిలిటరీ ప్రతిఘటన శక్తిని పెంచాయి. ఉక్రెయిన్ దళాల ప్రతిఘటన ఊహించలేదని పశ్చిమ దేశాల సంస్థలు వార్తలు ఇచ్చాయి. బెలారస్ మధ్యవర్తిత్వంలో జరిగిన బేషరతు చర్చలు ఎలాంటి ఫలితం తేలకుండానే సోమవారం ముగిశాయి. భద్రతా కారణాల రీత్యా ఈ చర్చలు సరిగ్గా ఎక్కడ జరిగాయన్నది అధికారికంగా ప్రకటించలేదు. బెలారస్-ఉక్రెయిన్ సరిహద్దులో "మత్స్యకారుడి గుడిసె"లో అని గుప్తనామం చెప్పారు. ఈ చర్చలు సరిహద్దులో తమవైపే జరపాలని పట్టుబట్టిన ఉక్రెయిన్ మెట్టుదిగి బెలారస్ వైపుకే తన ప్రతినిధులను పంపింది. రెండవ దఫా సంప్రదింపులు బెలారస్-పోలాండ్ సరిహద్దులో జరపాలని నిర్ణయించారు. వీటి ఫలితం గురించి ప్రపంచమంతా ఎదురు చూస్తోంది. ఈ రెండు దేశాల వివాదంతో ఇప్పటికే చమురు ధరల పెరుగుదల, సరఫరా వ్యవస్థలకు అంతరాయం, పరస్పర ఆంక్షల కారణంగా ప్రత్యక్ష, పరోక్ష ప్రభావాలు, పర్యవసానాలను ప్రపంచం చవి చూస్తోంది. మంగళవారం నాడు జరిగిన దాడుల్లో ఉక్రెయిన్‌లో రెండవ పెద్ద పట్టణమైన ఖర్‌కివ్ నగరంలో కర్నాటకకు చెందిన విద్యార్థి నవీన్ శేఖరప్ప మరణించటం తీవ్ర విచారకరం.

శాంతి చర్చలు జరుగుతున్న సమయంలో ఇరుపక్షాలూ సంయమనం, కాల్పులకు విరామం పాటించటం సాధారణంగా జరుగుతుంది. ఇక్కడ అటువంటి అవకాశాలు కనిపించలేదు. చర్చలు చర్చలే, దాడులు దాడులే అని రష్యా చెప్పటం కొంత మందికి విపరీతంగా అనిపించవచ్చు. ఉక్రెయిన్ను రెచ్చగొట్టి ముందుకు తోసిన పశ్చిమ దేశాలు ప్రత్యక్షంగా దాడులకు దిగలేదు తప్ప రష్యాను దెబ్బతీసేందుకు భద్రతా మండలిని సాధనంగా చేసుకొని ప్రచారదాడి, ప్రతిరోజూ కొత్త ఆంక్షలు, చర్యలను ప్రకటిస్తూనే పరోక్షదాడులను పెంచుతున్నాయి. ఇదంతా ఉక్రెయినుకు మద్దతుగానే అన్నది తెలిసిందే. ఈ నేపథ్యంలోనే తన అణుదళాలను సిద్ధంగా ఉండాలని పుతిన్ ఆదేశించాడు, చర్చల సమయంలో దాడులను ఆపేది లేదని కూడా ప్రకటించాడు. ఇవన్నీ వత్తిడిని పెంచే ఎత్తుగడలే. రెండు దేశాల మధ్య చర్చలు ఎన్నిసార్లు జరిగినా కీలక సమస్యపై అంగీకారం కుదిరితేనే సంధి తప్ప మరొకమార్గం లేదు. ఉక్రెయిన్‌కు నాటో సభ్యత్వమిచ్చి ఆ ముసుగులో రష్యా సరిహద్దుల్లో తిష్టవేయాలన్న తన ఎత్తుగడను అమెరికా పక్కన పెట్టేందుకు సిద్ధం కావటంలేదు. అందువలన భౌతికంగా దాడి ఉక్రెయిన్ మీద జరుపుతున్నప్పటికీ అసలు లక్ష్యం నాటో కూటమి, దాని పెద్ద అమెరికా అన్నది స్పష్టం. నాటోలో చేరకుండా తటస్థదేశంగా ఉంటామని ఉక్రెయిన్ హామీ ఇవ్వాలని రష్యా పట్టుపడుతోంది. ఒకవైపు తమను ముందుకు తోసి నట్టేట ముంచారని ఉక్రెయిన్ నేత జెలెన్స్కీ చెబుతూనే ఇంకా దింపుడు కల్లం ఆశ మాదిరి పశ్చిమ దేశాల ఆంక్షలు రష్యాను దారికి తెస్తాయనే భ్రమలో ఉన్నట్లు కనిపిస్తోంది. రష్యాను ఖండిస్తూ భద్రతా మండలిలో పెట్టిన తీర్మానాలు వీగిపోతాయని తెలుసు. అయినా ప్రచారదాడిలో భాగంగా ఆ తతంగం నడిపించిన తరువాత కొనసాగింపుగా ఇప్పుడు సోమవారం నుంచి ఐరాస సాధారణ అసెంబ్లీలో ప్రత్యేక చర్చకు తెరతీశారు. దాని మీద ఓటింగ్ జరగనుంది. దాని ఫలితం ఏమైనప్పటికీ నిబంధనల ప్రకారం దాన్నెవరూ అమలు జరపాల్సిన అవసరం లేదు. గతంలో యుగోస్లావియాపై భద్రతా మండలి అనుమతి లేకుండానే నాటో దళాలు 78రోజుల పాటు దాడులు చేశాయి. దాన్ని మూడు ముక్కలు చేసి బోస్నియా, హెర్జ్‌గోవినా, సెర్బియాగా విడతీసి ప్రత్యేక రాజ్యాలుగా గుర్తించాయి. అల్బేనియా నుంచి కొసావోను విడగొట్టి గుర్తింపునిచ్చాయి. చైనా అంతర్భాగాలైన తైవాన్, హాంకాంగ్ లను స్వతంత్ర దేశాలుగా గుర్తించాలన్న కుట్రనూ బలపరుస్తున్నాయి. ఇప్పుడు అవే నాటో దేశాలు ఉక్రెయిన్లో స్వాతంత్ర్యం కోరుకుంటున్న డాంటెస్క్, లుహానస్క్ రిపబ్లిక్‌లను రష్యాగుర్తిస్తే చట్టబద్ధతకు ముప్పు వాటిల్లిందంటూ గుండెలు బాదుకుంటున్నాయి.

ఉక్రెయిన్ నాటోలో చేరకూడదన్న ప్రధాన డిమాండ్‌తో పాటు రష్యా మరికొన్ని అంశాలను కూడా ముందుకు తెచ్చింది. 2015మిన్స్క్ ఒప్పందాన్ని అమలు జరపాలని అది డిమాండ్ చేస్తోంది. డాంటెస్క్, లుహానస్క్ రిపబ్లిక్‌లను స్వయంపాలిత ప్రాంతాలుగా ఉక్రెయిన్ గుర్తించాలని, ఆ ప్రాంతాల నుంచి మిలిటరీ సామగ్రిని తొలగించాలన్న వాటితో పాటు పన్నెండు అంశాలున్నాయి. దాన్ని ఉక్రెయిన్ ఉల్లంఘించింది. ఆ ఒప్పందానికి మధ్యవర్తిత్వం వహించిన నాటోలోని జర్మనీ, ఫ్రాన్స్ దేశాలు కూడా పట్టించుకోకుండా చోద్యం చూశాయి. ఇప్పుడు ఆ రిపబ్లిక్‌లను స్వతంత్ర దేశాలుగా రష్యా గుర్తించటంతో అవి కూడా గగ్గోలు పెడుతున్నాయి. రష్యా ముందుకు తెచ్చిన అంశాలను అంగీకరించేందుకు ఉక్రెయిన్ సిద్ధంగా ఉన్నప్పటికీ అమెరికా, నాటో కూటమి పడనిచ్చేట్లు కనిపించటం లేదు. అవి విధించిన ఆంక్షలు రష్యాకు ఆర్థిక ఇబ్బందులు తలెత్తి జనంలో పుతిన్ మీద వ్యతిరేకతను రేకెత్తించాలన్న పథకం కూడా ఉందన్నది స్పష్టం. రష్యన్ ఆర్థిక వ్యవస్థను కుప్పకూల్చివేస్తామని ఫ్రాన్స్ ఆర్థిక మంత్రి బ్రూనో లీ మారీ చెప్పాడు. రష్యామీద పూర్తి స్థాయిలో ఆర్థిక యుద్ధం చేయనున్నట్లు, ఆ మేరకు ఆర్థిక రంగాన్ని దెబ్బతీస్తామని ఒక రేడియోలో మాట్లాడుతూ చెప్పాడు. ఈ అంశాలు పుతిన్‌కు తెలియనివేమీ కాదు కనుకనే ప్రతి ఆంక్షలు, తీవ్ర వత్తిడికి పూనుకున్నాడు. ఇప్పటికి ఐదు దఫాలుగా నాటోను విస్తరించి రష్యా ముంగిట తిష్టవేసేందుకు అమెరికా పూనుకుంది. ఈ వివాదానికి మూలం అదే అన్నది తెలిసిందే. రష్యా భద్రత అంశాన్ని విస్మరించి ఏకపక్షంగా ముందుకు సాగితే కుదరదని పుతిన్ పశ్చిమ దేశాలకు స్పష్టం చేశాడు. దానిలో భాగంగానే క్రిమియాను తమ అంతర్భాగంగా గుర్తించాలని, ఉక్రెయిన్లోని నయానాజీ మూకలను వదిలించుకోవాలని కూడా కోరుతున్నాడు.

# అణుయుద్ధంపై ఆందోళన వ్యక్తం చేసిన రష్యా


**మాస్కో:** అణు యుద్ధం మానవాళికి పెనువిపత్తుగా మారుతుందని రష్యా ఆందోళన వ్యక్తం చేసింది. ఉక్రెయిన్‌పై సైనికచర్యలు ఈ దిశగా వెళ్లకూడదని కోరుకుంటున్నట్లు తెలిపింది. అణుదాడి జరగనుందా అన్న విలేఖరుల ప్రశ్నకు రష్యా శాశ్వత ప్రతినిధి వాసిలీ నెబెంజియా పైవిధంగా సమాధానమిచ్చారు. ప్రస్తుత పరిస్థితులు అణ్వాయుధ ప్రయోగానికి దారితీయకూడదని దేవుడిని ప్రార్థిస్తున్నానని అన్నారు. అటువంటి వివాదం ఎప్పటికీ జరగదని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. రష్యా అధ్యక్షుడు పుతిన్ దేశ అణ్వాయుధాలను సిద్ధంగా ఉంచాలని హెచ్చరించినట్లు రష్యా అగ్ర దౌత్యవేత్తలలో ఒకరు పేర్కొన్నారు. యూరప్ నుండి అమెరికా తన యుద్ధ ట్యాంకులను తొలగించాలని పిలుపునిచ్చారు. కీవ్ తన అణుయేతర హోదాను ఉల్లంఘిస్తోందని, బెదిరింపులకు దిగుతోందని ఆయన అన్నారు. ఉక్రెయిన్ సొంతంగా అణ్వాయుధాలను కొనుగోలు చేసే ప్రణాళికలకు సంబంధించి ప్రమాదకరమైన విన్యాసాలు ప్రారంభించిన అనంతరం అంతర్జాతీయ భద్రతకు జెలెన్స్కీ పాలన ద్వారా ఎదురయ్యే ప్రమాదాలు గణనీయంగా పెరిగాయని అన్నారు. అణు యుద్ధం చెలరేగితే విజేతలే ఉండరని జెనీవాలో మంగళవారం నిర్వహించిన నిరాయుధీకరణ సదస్సులో రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ కూడా హెచ్చరించారు. పుతిన్ తమ బాలిస్టిక్ క్షిపణులతో కూడిన యూనిట్లను, ఓడలను సన్నద్ధంగా ఉండాలని ఆదేశించిన సంగతి తెలిసిందే. అమెరికా, యూరోపియన్ యూనియన్ అధికారుల నుండి వస్తున్న దూకుడు ప్రకటనల నేపథ్యంలో తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు.



## పుతిన్ భారీ మూల్యం చెల్లించక తప్పదు

**వాషింగ్టన్ :** ఉక్రెయిన్‌పై రష్యా సైనిక చర్యలకు పుతిన్ భారీ మూల్యం చెల్లించుకోవాల్సిందేనని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ వ్యాఖ్యానించారు. ప్రతి ఏడాది జనవరిలో అమెరికా అధ్యక్షుడు కాంగ్రెస్‌లో వార్షిక ప్రసంగం చేస్తారు. స్థానిక కాలమానం ప్రకారం.. మంగళవారం రాత్రి క్యాపిటల్ హిల్‌లో బైడెన్ ప్రసంగించారు. పుతిన్ పొరుగు దేశమైన ఉక్రెయిన్‌పై సైనిక చర్యలను ప్రకటించడం ద్వారా తప్పుగా అంచనా వేశారని, ఇందుకు ఆయన తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని అన్నారు. ఈ ఆదేశాల్లో స్వేచ్ఛా ప్రపంచపు పునాదులను కదిలించేందుకు యత్నించారని అరోపించారు. నియంతలు దూకుడుగా వ్యవహరించినందుకు మూల్యం చెల్లించిన విషయాలను చరిత్రలో చూశామని, వారు మరింత గందరగోళానికి గురవుతారని అన్నారు. ఉక్రెయిన్‌కు మద్దతిస్తామని పునరుద్ఘాటించారు. అలాగే ఆర్థిక, సైనిక సహాయాన్ని అందిస్తామని వాగ్దానం చేశారు. అయితే రష్యాను ఎదుర్కొనేందుకు అమెరికన్ దళాలను పంపే ఆలోచనేలేదని అన్నారు. యూరోపియన్ యూనియన్ బలగాలను పంపనున్నట్లు తెలిపారు. పోలాండ్, రుమేనియా, లాట్వియా, లిథుమేనియా, ఎస్టోనియాతో సహా నాటో దేశాలను రక్షించడానికి అమెరికన్ సైన్యం, ఎయిర్ స్క్వాడ్రాన్‌లు, ఓడలను సమీకరిస్తామని అన్నారు. యునైటెడ్ స్టేట్స్‌తో పాటు తమ మిత్ర దేశాల ప్రతి అంగుళం భూభాగాన్ని కూడా రక్షించుకునేందుకు యత్నిస్తామని అన్నారు. అది నాటో భూభాగమని, తమ సామూహిక శక్తితో కూడుకున్నదని అన్నారు. రష్యా దాడి ఉద్దేశం ఉక్రెయిన్ ప్రభుత్వాన్ని నిర్వీర్యం చేయడం, నిర్మూలించడమేనని, అక్కడ మారణహోమం సృష్టిస్తున్నారని అన్నారు.

## ఉక్రెయిన్‌కు ప్రపంచ బ్యాంక్ మూడు బిలియన్ డాలర్ల ఆర్థిక సహాయం




**వాషింగ్టన్ :** ఉక్రెయిన్ కోసం 3 బిలియన్ డాలర్ల సహాయ ప్యాకేజీని అందించనున్నట్లు ప్రపంచ బ్యాంకు ప్రకటించింది. దీనిలో 350 మిలియన్ డాలర్లను తక్షణ ఆర్థిక సహాయం కింద అందించనున్నట్లు తెలిపింది. వరుసగా ఆరోరోజు ఉక్రెయిన్‌పై దాడి కొనసాగుతోంది. నగరాల్లోని పౌర, పరిపాలనా భవనాలే లక్ష్యంగా రష్యా దాడి చేస్తోందని ఉక్రెయిన్ ప్రభుత్వం తెలిపింది. కీవ్ వెలుపల 64 కి.మీ మేర రష్యన్ యుద్ధవిమానాలు మోహరించిన ఉపగ్రహ చిత్రాలు విడుదల చేసింది. దీంతో తమ దేశానికి సహాయం అందించాలంటూ ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలిన్స్కీ అమెరికాను కోరారు. మొదట రష్యా దురాక్రమణను అరికట్టడం అత్యవసరమని అన్నారు. దీంతో పలు దేశాలు రష్యాపై ఆంక్షలు విధించేందుకు సిద్ధమయ్యాయి. రష్యా విమానాలపై నిషేధం విధించనున్నట్లు అమెరికా అధ్యక్షుడు జోబైడెన్ ప్రకటించారు. కెనడా, యూరోపియన్ దేశాలు కూడా

రష్యా విమానాలపై నిషేధం విధించాయి. కీవ్ అనంతరం ఉక్రెయిన్‌లోని రెండవ ప్రధాన నగరమైన కార్కివ్‌లోని స్థానిక ప్రభుత్వ కార్యాలయంపై రష్యా దళాలు దాడి చేయడంతో పది మంది మరణించారని అధికారులు తెలిపారు. యూరోపియన్ యూనియన్ రష్యా మీడియా సంస్థలైన ఆర్‌టి, స్పుత్నిక్‌లను బ్లాక్ చేసింది. స్విఫ్ట్ బ్యాంక్ మెసేజింగ్ సిస్టమ్ కొన్ని రష్యన్ బ్యాంకులపై నిషేధం విధించింది.

# రష్యాపై ఆంక్షలు మనకూ దెబ్బే!

**న్యూఢిల్లీ :** రష్యాకు వ్యతిరేకంగా అమెరికా, ఈయూ దేశాలు విధిస్తున్న ఆంక్షలు..భారత్‌పైనా తీవ్ర ప్రభావం చూపుతాయని ఆర్థిక నిపుణులు అంచనావేస్తున్నారు. ముఖ్యంగా భారత్ ఇంధన అవసరాలు, ఆహార దిగుమతులు అత్యంత ఖరీదుగా మారుతాయని, దేశ ఆర్థిక వ్యవస్థలోనూ అనూహ్య మార్పులు ఏర్పడతాయని నిపుణులు భావిస్తున్నారు. రష్యాను 'స్విఫ్ట్' (అంతర్జాతీయ నగదు లావాదేవీల వేదిక) నుంచి బహిష్కరించిన నేపథ్యంలో ప్రపంచ ఆర్థికరంగంలో పెను తుఫాన్ సంభవించవచ్చు. రష్యా, ఉక్రెయిన్ గోధుమ ఎగుమతుల్లో పావువంతు ఇంకా నౌకలకు ఎక్కలేదు. ఐరోపా గోధుమ, బార్లీ, మొక్కజొన్న అవసరాలు ప్రధానంగా ఉక్రెయిన్ ద్వారానే తీరుతున్నాయి. ఇప్పుడు రష్యాపై అమెరికా, ఈయూ సమాఖ్య విధించిన ఆంక్షలు ముందు ముందు పరిస్థితిని మరింత దిగజార్చుతుందని ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రపంచంలో గోధుమ, మొక్కజొన్న ఉత్పత్తిలో రష్యా, ఉక్రెయిన్‌లది అతిపెద్ద వాటా. ఆంక్షల వల్ల ఈ వీటి సరఫరా గొలుసు దెబ్బతినటం భారత్‌లాంటి దేశాలకు అనేక సమస్యలు తెచ్చిపెడుతుందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఉత్తరప్రదేశ్ ఎన్నికల పోలింగ్ ముగిసిన మరుక్షణం ధరల పోటు ఉంటుందని వార్తలు వెలువడు తున్నాయి. ద్రవ్యోల్బణం, ఇంధన ధరల పెంపు, నిత్యావసర సరుకుల ధరల పెంపు..ఇవన్నీ ఉక్రెయిన్-రష్యా యుద్ధం ఖాతాలో వేయడానికి మోడీ సర్కార్ సిద్ధమైందని ఢిల్లీ రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. స్విఫ్ట్ వేదిక నుంచి రష్యాను తొలగించటం భారతీయ బ్యాంకులపైనా ప్రభావం పడనున్నది. భారత్-రష్యా వాణిజ్య లావాదేవీలు ఎస్‌బీఐ, కెనరా, హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ.

.వంటి ప్రఖ్యాత బ్యాంకుల ద్వారా జరుగుతున్నాయి. ఇరు దేశాల వాణిజ్యం నేపథ్యంలో భారత్‌కు చెందిన చిన్న, పెద్దా ఎగుమతిదార్లకు ఈ బ్యాంకుల నుంచి భారీ మొత్తంలో రుణాలు అందాయి. స్విఫ్ట్ నుంచి హఠాత్తుగా రష్యాను తొలగించటం ద్వారా ఆ ఎగుమతిదార్ల వాణిజ్యం ప్రమాదంలో పడింది.